# విఘ్న వినాయకుడు

నరసప్ప నెత్తిన పిడుగు పడ్డట్టు అయింది. కాలూ, చేయీ ఆడలేదు. నరసప్ప కాళ్ళు మామూలు నడక్కి ఉద్దేశింపబడ్డట్టుగా ఉండవు. చేతులూ, అంతే! అడుగెయ్యటానికి కాళ్ళు డప్పు కొట్టటానికి చేతులు సృష్టింపబడ్డట్టు ఉంటాడు నరసప్ప.

ఈడిగ నారిగాని కల్లుగానీ, ప్రసాదు సారాగానీ – ప్రసాదంటే ప్రభుత్వ సారాయి దుకాణం – నాలుక మీద నాట్యమాడిందా నరసప్ప మహానటుడయిపోతాడు. మంట సెగకి డప్పు కాగి కణకణమంటే, సారా కడుపులోకి కాక తలకెక్కి తైతక్కలాడితే నరసప్పను పట్టలేరు. డప్పులాగే మనిషి బిగిసిపోతాడు. నీలుగుతాడు, నిక్కుతాడు. ఇక అడుగేస్తాడు. నరసప్పడుగేస్తే, వానెవ్వ, డప్పులాగే, భూగోళం కంగున మోగాలి. ఏ నటుడికి, నాట్యగాడికి వాడి అడుగు పడుతుంది? మహామహానటులు బలాదూరు!

డప్పు గొట్టే పని అయిపోయి సారా కాక దిగకపోతే నరసప్ప కాళ్ళూ చేతులు పడేపాట్లు పరమాత్ముడికి కూడా తెలియవు. కుక్కల్ని తన్నకుండా నడవడు. చిన్నపిల్లలకు మొట్టికాయలు వేయకుండా డాన్స్ లాంటి నడక నడవడు. వరసయిన ఆడవాళ్ళని వయస్సుతో నిమిత్తం లేకుండా మెడమీదో, నెత్తి మీదో పొడిచి, ముడ్డిమీదో, నడ్డిమీదో కొట్టి తిట్లు తినకపోతే నడక సాగదు. నిద్రపట్టదు. నరసప్ప సజీవంగా ఉన్నాడనటానికి నిదర్శనం తాగి అయినా ఉండటం – అది మెలకువ – నిద్రయినా పోవటం – అది విశ్రాంతి. మరో రకంగా మనిషి కనబడడు.

అట్లాంటిది నరసప్ప తాగకుండా మెలకువగా ఉన్నాడు. కాళ్ళు ఎట్లా నడవాలో నేర్చుకొంటున్నాయి. చేతుల్ని ఏం చేయాలో తెలియక గుండెమీదో, కాదంటే వీపు మీదో కట్టుకొని వెళుతున్నాడు. చేతుల్ని వదిలేస్తే అవి పొట్లకాయల్లా, తోటకూర కాడల్లా వాలిపోయి వేలబడుతున్నాయి.

పూజారి ఇంటి ముందు నిలబడి "అయ్యోరు! అయ్యోరు!" అని పిలిచాడు. 'ఆఁ' అని లోపలనుంచి బదులు వినిపించింది. అయ్యవారు వచ్చి "ఏమప్పా నరసప్పా వచ్చినావు?" అని అడిగాడు.

"సాఁవి ఇనాయక సవితికి ఇగ్న ఇనాయకుని పెట్టాల్ల అంటా ఉండినారు సాఁవి మావాల్లు!"

"పెట్టుకొండప్పా! నేనొద్దంటినా?"

"పూజలు సాంవి!"

"నేను చేసేది ఇష్టమే! మీరు సచ్చేది ఇష్టం కాదప్పా"

"అట్టా ఇసూరి ఉండదు సాంవి. పూజలు పుడుసులు నువ్వే చెయ్యాల్ల"

"అట్లాగే కానీ నరసప్పా!"

పూజారి రానంటాడని నరసప్ప సందేహం. చొక్కాలేని, ధోవతి, నిక్కరు, డ్రాయరు పైని ఎగ్గట్టుకొన్న పూజారి జంధ్యం సవరించుకొంటూ సరేననేసరికి పూజారి నుదుటి బొట్టు తళుక్కుమంది.

ఈసారి ఎవరేగాని చచ్చేది ఉండదని నరసప్ప నమ్మకం, ప్రయత్నం.

పోయినేడు వినాయక నిమజ్జనం రోజున నలుగురు మాదిగలు చనిపోయారు. తాగి తన్నుకు చచ్చారని పుకారు పుట్టింది. సవర్ణులు కొట్టి చంపారని పత్రికలు రాశాయి.

పెళ్ళంటే కుక్కలకు హడావుడి జాస్తి అయినట్లు, చావంటే పోలీసుల ధాంధూంలెక్కువ. వాళ్ళు రావటం రావటం, కనపడ్డవాళ్ళను జీపుల్లోకి తోశారు. ముప్పైమంది మీద కేసు రాశారు. జైల్లో పెట్టారు. కోర్టు చుట్టూ తిప్పుతున్నారు. సంవత్సరమయినా కేసు తెమల్లేదు. వాళ్ళంతా ఇప్పుడు జైల్లో లేరుగాని, కేసులో ఉన్నారు. ఆ భయంతో ఈ ఏడు ఏమీ జరగదని ఊరి నమ్మకం. ఆ కోపంతో ఎవరయినా ఏమయినా చేస్తారని మాదిగల భయం. ఉడుకునెత్తురుండే యువకులు చస్తే చచ్చాం ఈ ఏడు వినాయకచవితి చేయాలని పట్టుబట్టారు. వాళ్ళను కాదనలేక కొంత, వీళ్ళకూ ఇష్టమై కొంత మాదిగపెద్దలు మౌనంగా ఉన్నారు.

గ్రామంలో సవర్ణ యువకులు ఇది విని మండిపడ్డారు. వీళ్ళకింకా బుద్ధిరాలేదా అనుకొన్నారు. పోయినేడు నలుగురితో పోయింది. ఈ ఏడు పదిమంది అవుతారు అని అనటం నరసప్ప విన్నాడు. అప్పటి నుంచి కాలుగాలిన పిల్లిలాగా అయిపోయాడు. చరిత్ర పునరావృతం కాకూడదని నరసప్ప కోరిక.

కాశ్మీరు నుంచి కన్యాకుమారికి పోయే నేషనల్ హైవే ఏడు మీద కర్నూలు నుంచి పోతూ మిట్ట దిగినప్పుడు అనంతపురం నుంచి వస్తూ కొండ దిగినప్పుడు లోయలో ఉన్న ఊరు పేరు ప్యాపిలి. రెండు జిల్లాల కూడలి గ్రామం. రెండు జిల్లాల వ్యక్తిత్వానికి వారసత్వపు హక్కు ఉన్న ఊరు. రోడ్డుకిరువైపులా ఉన్న పంచాయితీ గ్రామమది.

గణేశ్ నిమజ్జనానికి బయలుదేరే మాదిగలు ఆ రోడ్డు మీదే ఊరును దాటిపోయి చెరువును చేరుకోవాలి. అన్ని కులాల విగ్రహాలు ఆ తోవనే పోతాయి కానీ, మాదిగల విగ్రహం మాత్రం ఆ రోడ్డున పోరాదు.

ఇది హైవే అని మాదిగలు, ఇది మా ఊరిరోడ్డని సవర్ణులు అనటం తగాదాకు మూలమని, చావులకు కారణమని అందరికీ తెలుసు. సవర్ణులందరికీ ఈ సమస్యతో సంబంధం

లేదు. పెద్దలకూ పేచీలు లేవు. యువకులతోనే గొడవలు. విఘ్న వినాయకుణ్ణి విఘ్నాలు లేకుండా చేయమని మంచి పనులు ప్రారంభించినప్పుడు ప్రజలు పూజిస్తారు. మాదిగలు భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం గణపతి పూజ చేసి ఎరుగరు. హనుమంతుడే అప్పుడు వాళ్ళ అసలు దేవుడు. అంతకు పూర్వం వాల్కు పోతురాజును, పోలేరమ్మను అంకాలమ్మను, పెద్దమ్మను పూజించే వాళ్ళు. ఆపైన శివుణ్ణి, లింగాన్నీ కొలిచేవాళ్ళు. ఆ దేవుడికిలాగానే వీళ్ళకూ స్వామి భక్తి ఎక్కువ. వీళ్ళకు తల ఇవ్వటమో, తీయటమో మాత్రం బాగా తెలుసు. అందుకే వీళ్ళు సవర్ణులకు నమ్మినబంట్లు. ఫాక్షన్ తగాదాల్లో చచ్చినా, చంపినా వీళ్ళే ముఖ్యం.

ఈమధ్య మహారాష్ట్ర నుంచి గణేష్ ఉత్సవాలు దిగుమతి అయిన ఆంధ్రరాష్ట్రంలో అన్ని పల్లెలూ చేస్తున్నట్లే, ప్యాపిలీ పూజలు చేయసాగింది. ప్రతి వీధిలో ఒక ఉత్సవ విగ్రహం వెలుస్తుంటే తామూ ఒక విగ్రహం పెట్టి, మైకు కట్టి, పందిరి వేసి, తీర్థప్రసాదాలు పంచి, ఎగిరెగిరి గంతులేసి, రంగు కాగితాలు కట్టి, డాన్సులు పెట్టి ఐదో, ఏడో, తొమ్మిదో రోజులు వేడుకలు చేసి, చివరిరోజు ఉత్సవ విగ్రహం నిమజ్జనం చేయసాగారు. మాదిగలు, గణేశు బొజ్జకీ, మాదిగల బొజ్జలకి అన్నివిధాలా పోలికలు ఉండటం వాళ్ళకు ప్రత్యేక ఆకర్షణ కూడా అయి ఉంటుంది.

"యారా నరిసిగా బాగుండావా?" అని పలకరించాడు చిదంబరరెడ్డి. రెడ్డి, తరిమెల నాగిరెడ్డి అనుచరుడు. నాగిరెడ్డి అండర్‌గ్రౌండ్‌లో ఉన్నప్పుడు కేరాఫ్ చిదంబరరెడ్డి అని పోలీసు రికార్డులు చెబుతుంటాయి. నాగిరెడ్డి మూలంగా న్యాయమైన కమ్యూనిస్టులు ప్యాపిలిలో ఉంటారని జిల్లాలో ప్రతీతి. వాళ్ళు మాదిగల్ని బాగా చేరదీసి కాపాడుతూ ఉండేవాళ్ళు. చిదంబరరెడ్డి ఆ వూరిలో కమ్యూనిస్టు నాయకుడు. మాదిగల విశ్వాసం పొందినవాడు.

"యామిరా వచ్చినావు" అని అడిగాడు.

నరసప్ప, యువకులు, గణేశ్ ఉత్సవం ఏర్పాటు, సవర్ణ యువకులు, గొడవలు వివరించి చెప్పాడు.

"వాల్లు వాల్ల దేవుని కొలుసుకోమను. దానికీ, దీనికీ పేచీలు రానివ్వొద్దు. వానికీ, వీనికీ మాటలు వద్దు. నేను సరిది జెబుతా. నువ్ బో".

"వాళ్ళకి నువ్వే చెప్పాల్ల"

చిదంబరరెడ్డి తల ఊపాడు. సెల్లాడం ఎగలాక్కుంటూ నరసప్ప బయలెల్లాడు. డ్రాయర్‌కంటే పెద్దది, పైజామా కంటే పొట్టిది, మోకాళ్ళ కిందికుంది సెల్లాడం. పైన అంగీ, కురచ చేతుల చొక్కాకంటే చిన్నది. బన్నీనుకంటే పెద్దది. ఉంగరాల జుట్టుకు నూనె రాసి ఎన్ని యుగాలయిందో చెప్పే నాథుడు లేడు. దండకడియాలు పిక్కల బిర్రుకు బిగిసిపోయాయి. కాళ్ళ పిక్కలు టెంకాయ చిప్పలకు మల్లె రాటుతేలి ఉన్నాయి. మెడలో కంటే ఉబ్బిన నరాల్ని బిగదీస్తూ ఉంది. ఏడాది పిల్లవాణ్ణి నరసప్ప చేతుల్లో పెట్టి అతడి భార్య చనిపోయింది. చేతికెక్కి

వచ్చిన కొడుకు ఏడాది కిందట చనిపోయాడు. ఉద్యోగం చేసి ఊళ్ళేలకపోయినా పోషిస్తాడని, డప్పు గొట్టే తిప్పలు తప్పుతాయని ఆశపడ్డాడు, నరసప్ప. ఈనగాచి నక్కలు పాలు చేసినట్లు ఉద్యోగం వచ్చిన వారానికే చావు మూడింది.

చిదంబరరెడ్డిని చిన్నప్పుడు 'సితంబరియ్య' అనేవాళ్ళు. పెరిగి పెద్దయినాక ఆయప్ప రెడ్డి పేరు చేర్చుకున్నాడు. ప్యాపిలి లోయలో గ్రామమే అయినా నీటి వసతి లేదు. వానపడితే పంటలు. లేకపోతే బీళ్ళు. బావులెండాయి. బోర్లెండాయి. వ్యవసాయం జూదమయింది.

చిదంబరరెడ్డి ఇంట్లో అంతకుముందు చదువుకొన్నవాళ్ళు లేరు. తన నాయకుడి పేరే తన కొడుక్కి నాగిరెడ్డి అని పెట్టాడు. అతణ్ణి స్కూలులో, కాలేజీలో, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో యమ్మేదాకా చదివించాడు. నరసప్ప కొడుకు నాగిరెడ్డి క్లాస్‌మేట్! ఇద్దరూ పెద్ద తెలివితేటలున్న హీరోలేంగాదు. కష్టపడి సెకండ్ క్లాస్‌లో పాసయ్యారు. మాదిగ నరసప్ప కొడుకు కాంట్రాక్టు లెక్చరర్‌గా ఆరువేల జీతం సంపాదించేవాడుకాగా, నాగిరెడ్డి డియస్సీ రాసి మూడువేల టీచరు పోస్టు కోసం పడిగాపులు పడుతున్నాడు.

"యావన్నా వచ్చినావు" జయన్న నాయుడు నరసప్పను పలకరించాడు. అన్నాతమ్ముడు, అక్కా చెల్లెలు అని పిలుచుకొనే పూర్వపు అలవాటు జయన్న మరిచిపోలేదు. చిదంబరరెడ్డి అనుకొంటున్నప్పుడే జయన్న నాయుడు అని పిలిపించుకోసాగాడు.

'జయన్న నాయుడన్న సాయం చెయ్యాల్లన్నా" అన్నాడు సరసప్ప.

జయన్న పిల్లికి బిచ్చం పెట్టడనీ, ఎంగిలి చేత్తో కాకిని తోలడనీ ఊరికంతటికి తెలుసు. అతడి మాటంటే కమ్మ కులస్థులంతా తల ఊపుతారు. హెచ్చులకు పోకుండా ఉన్నంతలో మప్పితంగా, గుంభనంగా సంసారం సాగించే స్వభావం జయన్నది. లేదని ఒకర్ని దేహి అన్నది లేదు. ఉందని హత్యలు చేయించింది లేదు. గుట్టు మనిషి, చాలాకాలం రాజకీయాల మాట అనేవాడు కాదు. తెలుగుదేశం పార్టీ ఏర్పడ్డాక తెలుగుదేశం కేండిడేట్‌కు ఓటు వేయమని వేయించమని కోరే సాహసానికి ఒడిగట్టాడు. కొంతకాలం చిదంబరరెడ్డి కూడా తెలుగుదేశం పాటలే పాడేవాడు. పార్టీల్లో పైవాళ్ళలో వచ్చిన మార్పులవల్ల చిదంబరరెడ్డి మాట, మనస్సు మార్చుకొన్నాడు. జయన్న మాత్రం ఒకేమాట మీద నిలబడి ఉన్నాడు. మాదిగలు జయన్నను నమ్మరు కాని తెలుగుదేశం అభ్యర్థులకు ఓటు వేసేవాళ్ళుగా మారిపోయారు.

జయన్న కొడుకు వెంకటనాయుడు చాలా చురుకైనవాడు. తెలివైనవాడు. స్కూలు ఫస్టుగా పదోతరగతి పాసయ్యాడు. తండ్రి ఎద్దుగుద్ద పొడుచుకొనే మనకు చదువెందుకని మానిపించాడు. వెంకట నాయుడు వ్యవసాయం పనులు చూసుకోసాగాడు. అంతంత మాత్రంగా హైస్కూలు చదువు దాటిన తన క్లాసుమేట్ సిద్ధుడు, సిద్ధేశ్వర ప్రసాద్ పేరిట యమ్మే పాసయి, కలెక్టరు చదువుకోసం ఢిల్లీ వెళ్ళి, తిరిగి ప్యాపిలి వచ్చి, బస్సు దిగుతుంటే వెంకటనాయుడు చూశాడు. సిద్ధుడు తండ్రి తను ఇంటి సేద్దెగాడుగానే ఇంకా ఉన్నాడు. సిద్ధేశప్రసాద్ తెల్లపేంటు,

తెల్లషర్టు, కళ్ళకుజోడు, కాలికి బూటు, బన్నీను కనిపించే చొక్కా జేబులో వందరూపాయల నోట్లు, ఎండిన చెరువులో చేపల్లా ఎగురుతుంటే, సినిమా హీరోలా పోజు పెట్టి నడుస్తుంటే తనను పలకరించకుండా పోతుంటే వెంకటనాయుడి కడుపు 'భగ్గు'మంది. ప్రసాద్ పోయినేడు చచ్చి ఊరుకొన్నాడు.

ప్యాపిలిలో మాలలు లేరు. మాదిగలు పదింట రెండు వంతులున్నారు. సాయిబులు ఒక వంతు ఉన్నారు. సాయిబులు మాదిగల మాటే మాట్లాడుతుంటారు. వాళ్ళు ముస్లింలు, వీళ్ళు హిందువులు, వాళ్ళది తురకం. వీళ్ళది తెలుగు. వాళ్ళది ఈద్గా. వీళ్ళది దేవాలయం. ఏమీ సంబంధం లేదు. కానీ ఏదో సంబంధం ఉంది. అన్నదమ్ములులాగా ఉంటారు.

ఆ వూళ్ళో పదికి అయిదుమంది చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి ముఖ్యంగా నేసేవాళ్ళు, బలిజలు, కురబలు ఉన్నారు. వాళ్ళందరినీ నరసప్ప పలకరించి గణేశ్ ఉత్సవం బాగా జరగాలని, మాదిగల్ని ఎవరూ చంపకుండా కాపాడాలని అర్థించాడు. మేం మీకు మిత్రులమే. మేం మిమ్మల్ని చంపం అని వాగ్దానం చేయించుకొన్నాడు.

వాళ్ళలో కొందరు ఈ ఉత్సవాలెందుకు? ఊరేగింపులెందుకు? కొట్లాటలెందుకు? చావులెందుకు? అని హెచ్చరించారు. కొందరు ప్రోత్సహించారు. మొత్తం మీద మీ పూజలు మీరు చేసుకోండని చెప్పారు.

నరసప్ప ఏమీ చదువుకోలేదు. దండోరానో, టముకో వేయటానికి కలెక్టరు దొరవారి దగ్గర్నుంచి యం.ఆర్.ఓ. దొరవారిదాకా ఎందరినో కలిశానని నరసప్ప గొప్పలు చెప్పుకొంటాడు. ఎమ్మెల్యేలు, ఎంపిలు తనతో ఎన్నో పనులు చెప్పి చేయించుకొన్నారంటాడు. మునుపు బ్లాకు ఉద్యోగులు, ఇప్పుడు మండలాఫీసు వాళ్ళు తన చుట్టూ తిరిగేవాళ్ళని అంటుంటాడు. ఏయే విషయాలను డప్పుగొట్టి ప్రకటన చేయాల్లో విని గుర్తుంచుకొని, దండోరా వేయటంతో అతడికి ఎన్నో విషయాలు తెలిసివచ్చాయి. పల్లె మాదిగల్లో లోకం తెలిసినవాడు నరసప్పే. అతడి మాట వాళ్ళకు సుగ్రీవాజ్ఞ. అతడికి ఎవరితో ఎట్లా మాట్లాడాలో తెలుసు. ఎట్లా పనులు చేయించుకోవాలో అర్థమయింది. నలుగురిలో బాగుండి తన పనులు తాను చక్కబెట్టుకొనే లౌక్యం వంటబట్టింది.

నరసన్న తలూపగానే, పెద్దమ్మ గుడి పక్క పందిరి లేచింది. గణేశ్ విగ్రహం మొలిచింది. పూజలు మొదలయ్యాయి.

ప్యాపిలి అంతచిన్న ఊరా, అయిదు గణేశ్ విగ్రహాలు వెలిశాయి. పూజా పునస్కారాలు మొదలయ్యాయి. అయిదు మైకులు మైకం పెంచుతున్నాయి. ఒకర్ని చూచి, ఒకరు సౌండు పెంచుతున్నారు. ఊరు హోరెత్తిపోతూ ఉంది. ప్యాపిలి ఈ హోరులో తెప్పై తేలిపోతూ ఉంది. జనం నిద్రపట్టక ఎవరినీ ఏమీ అనలేక, చెవుల్లో దూది పెట్టుకొని కాలం గడుపుతున్నారు.

హైదరాబాదు నుంచి కర్నూలు మీదుగా అనంతపురం, కదిరి, హిందూపురం, బెంగుళూరు, మైసూరు పోయే బస్సులు ప్యాపిలి రాగానే ఉలిక్కిపడుతున్నాయి. నిద్రపోతున్న ప్రయాణికులు బిత్తరపోయి లేచి, చుట్టూ చూచి గణేశ్ ఉత్సవం మైకులహోరని, ఎక్సిడెంట్ కాదని మళ్ళీ నిద్రలోకి జారుకొంటున్నారు. కర్నూలువైపు పోయేవాళ్ళు మెలకువగా ఉండగానే వాళ్ళ బస్సులు ప్యాపిలి దాటిపోతుంటే విగ్రహాలను బస్సుల్లోంచే చూచి దండం పెట్టుకొని పోతున్నారు. ఈ ఉత్సవాలలో ఖర్చు చేసే సొమ్ము చూచిన కాశ్మీరు, కన్యాకుమారి యాత్రికులు అనంతపురంలో కర్నూలులో కరువు ఉందంటే నమ్మటానికి సందేహిస్తున్నారు.

ప్యాపిలికున్న పెద్ద లాభం నేషనల్ హైవే. చాలాసార్లు దూరప్రదేశాల యాత్రికుల కార్లు, బస్సులు, లారీలు, వేన్లు, ప్రయాణ సౌకర్యాల వాహనాలన్నీ అక్కడ ఆగుతాయి. ప్రతిరోజూ వాహనాల ప్రయాణీకుల రద్దీ ఉంటుంది. అటూ ఇటూ పోయే ట్రాఫిక్‌వల్ల ప్యాపిలి రోడ్డుకిరువైపులా భోజనం హోటళ్ళు, కాఫీ హోటళ్ళు, టీ బంకులు, చిరుతిళ్ళ అంగళ్ళు, పళ్ళీ బళ్ళు, బట్టల షాపులు, చెప్పుల కొట్లు ఒకటేమిటి మనిషికి నిత్యావసర వస్తువులు, సరుకులు, కావలసినవన్నీ అమ్మే ప్రదేశంలా కూడలిగా మారిపోయింది. దీనికి తోడు వారానికో సంతరోజు, నెలకో పరస వల్ల కోడిపిల్ల కాడి నుంచి కోడెదూడదాకా, ఉప్పు, పప్పు నుంచి అల్లం, బెల్లందాకా చిన్నాచితకా పల్లెలకు ప్యాపిలి కేంద్రంగా మారింది. వ్యాపారం పెరిగింది. అమ్మకాలు పెరిగాయి. ఆదాయం పెరిగింది. కొంత సుస్థిరత వచ్చింది. డబ్బు కనిపించసాగింది. వ్యవసాయం దెబ్బతిన్నా ప్యాపిలి ప్రజలు ఏదో వ్యాపారం చేసి బాగానే ఉన్నారు.

రాయలసీమకో జీవలక్షణం ఉంది. అది ఫ్యాక్షన్ జీవితం. డబ్బుంటే ఫ్యాక్షన్ పామై పడగవిప్పి కాటేస్తుంది. లేదంటే మన్నుదిన్న పాములా పడి ఉంటుంది. ఈ కక్షలు కార్పణ్యాలు వెంటనే బయటపడవు. మాటువేసి వేటు వేస్తాయి. ఆ దెబ్బకే నలుగురు మాదిగ యువకులు హతమయ్యారు.

నరసప్ప ఒక్కగానొక్క కొడుకు కాంట్రాక్టు లెక్చరరు అయి, కళ్ళు తెరిచే లోపల శవమయ్యాడు. ఐ.ఏ.యస్. పరీక్ష - ప్రిలిమినరీ పాసయి-మెయిన్ రాయటానికి సిద్ధపడుతున్నవాడు చచ్చిపోయాడు. పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి పల్లెకు వచ్చి లా అండ్ ఆర్డరు గురించి మాట్లాడినవాడు, యం.ఆర్.ఓ.గా సర్వీసు కమీషన్‌లో సెలక్ట్ అయి ఉద్యోగంలో చేరినవాడు, పోయినేడు గణేశ్ నిమజ్జనం రోజున చనిపోయిన మాదిగ యువకులు.

సవర్ణ యువకులు చాలా సందేహాలకు లోనయ్యారు. వీళ్ళు ఏం బలం చూచుకొని ఈ ఏడు కూడా విగ్రహం పెట్టారూ అని, వీళ్ళకు ఎందుకు భయం లేకుండా పోయిందీ అని, గుంజాటనలో పడ్డారు. మాదిగలు ఏం చేస్తారోనని వాళ్ళు భయపడుతున్నారు కూడా.

మైకుల రొద దగ్గర గొడవ అవుతుందేమోనని నరసప్ప సందేహించాడు. నలుగురితో సంప్రదింపులు జరిపి విగ్రహం పెట్టుకొన్నా, ఎప్పుడు ఏం అవుతుందోనని మాదిగలు మల్లగుల్లాలు పడుతున్నారు.

గణేశ్ నిమజ్జనం రోజున పాము పడగ విప్పుతుందేమోనని పోలీసు అండదండలు, కర్నూలు, అనంతపురం, డోన్, గుత్తి దళిత సంఘాల సహకారం సహాయం పొందాలని మాదిగలు కొందరు సూచించారు. నరసప్ప అంగీకరించలేదు.

"ఈ ఊరు మనది, బతికినంత కాలం ఈ ఊళ్ళో మనం బతక్క తప్పదు. ఎవరి సహాయం ఎన్ని రోజులుంటుంది? మనమే మనకు సహాయం" అన్నాడు.

"విగ్రహం పెట్టకుండా ఉత్సవం చేయకుండా ఉంటే బాగుండేది" అని వెనకడుగు వేసిన వాళ్ళున్నారు.

"పెట్టకపోతే బాగానే ఉంటుంది. భక్తి ఉండి, ఉత్సవం చేయాలని ఉత్సాహం ఉండి, భయం వల్ల విగ్రహం పెట్టకుండా ఉండటం చావుకంటే ఘోరమైన పరాభవం, పరాజయం. అంతకంటే చావు మేలు."

కొడుకు చనిపోయిన కోపంతో ప్రతీకారంగా ఈ ఏటి ఉత్సవం మొదలుపెట్టించాడని కొందరు, ఎవరో వచ్చి, డబ్బిచ్చి విగ్రహం పెట్టించారని కొందరు చెవులు కొరుక్కొంటున్నారు. ప్రేరక శక్తుల ఉనికి నిర్ధారించటానికి ప్రయత్నాలు ప్రారంభమయినప్పుడు, రెడ్డీ, నాయుడూ నరసప్పను పిలిపించారు.

రెడ్డి ఇంటి వరండాలో కుర్చీలమీద కూర్చున్న రెడ్డీ, నాయుడు ఎదుట నరసప్ప నిలబడ్డాడు.

"కూసో" అన్నారు. గోడవార కూర్చోవాలి. నరసప్ప ఇష్టపడలేదు.

"నిలవిండి దేవరా!" నిలబడే ఉన్నాడు.

'పోయినేటి పరిస్థితులు చక్కబడకముందే ఎందుకు ఉత్సవ ప్రయత్నాలు చేస్తున్నా'రని ప్రశ్నించారు. 'భక్తివల్ల' అన్న సమాధానం విన్నారు.

'ఎవరు ప్రోత్సమిస్తున్నా'రని అడిగారు. 'దేవుడ'ని చెప్పాడు.

'నిమజ్జనం రోజు ఏం చేయాలనుకొంటున్నారు' అని అడిగారు.

'నిమజ్జనమే' అని చెప్పాడు.

'లోపల్లోపల ఏం జరుగుతూ ఉంద'ని ప్రశ్నించారు. 'పూజ' అని చెప్పాడు.

వాళ్ళకు ఇంకా ఏమి అడగాలో తెలియలేదు. అంతలో కొందరు యువకులు అక్కడకు వచ్చారు. వాళ్ళు, మాదిగలు బాంబులు తెచ్చారన్నారు. లేదన్నాడు.

కత్తులు నూరుతున్నారన్నారు. కాదన్నాడు. వేట కొడవళ్ళు కొన్నారన్నారు. కొనలేదన్నాడు.

నిమజ్జనం రోజు గుంపులో దూరి తెగించి తమ వాళ్ళను చంపాలని చూస్తున్నారన్నారు. లేదన్నాడు.

ఏం మీ అహంకారమన్నారు. ఏమీ లేదన్నాడు.

చివరకు అందరూ కలిసి మీ కుట్ర ఏమిటి? మీ కుయుక్తి ఏమిటి? మీకు ఎవరేం నూరిపోశారు? బలమిచ్చారు? జనమిచ్చారు? డబ్బు ఇచ్చారు? పథకం వేశారు? వివరంగా చెప్పమన్నారు.

నరసప్ప చెప్పాడు. "మాదిగలు నిరుపేదలు. మీరు సంపన్నులు. మీరు పదిమంది. మేం పాతికమందిమి. మేం మీ మీద ఆధారపడి బ్రతుకుతున్నవాళ్ళం. మీ జోలికి మేం రాం. మమ్మల్ని మీరేమీ చేయవద్దు. మావి పేద కొంపలు కూలిపోతాయి. కాలిపోతాయి. మీవి మేడలూ, మిద్దెలూ కాలవు, కూలవు."

నరసప్ప మాటలకు నాయుడు అడ్డం వచ్చాడు. "మీకీమధ్య పొగరు పెరిగింది కదా!"

నరసప్ప ఒప్పుకొన్నాడు. "పొగరు పెరిగిన మాట నిజమే. కానీ మనం కలిసి జీవించవలసినవాళ్ళం. ఈ ఊరు విడుద్దామంటే మాకు సాధ్యమే! మీకు కాదు. మాకు పోయేదేమీ ఉండదు.గోచితప్ప. మేం ఏ రోజయినా ఈ ఊరు వద్దనుకుంటే మీకు విశ్రాంతి ఉండదు. ప్రశాంతి ఉండదు. పంటలు పండవు. పశువులుండవు. ప్రాణాలుండవు. కానీ మేం మా తాత ముత్తాతలు పుట్టి పెరిగిన ఈ నేల, మా నేల, మా తల్లి, మా దేవత, మా స్వర్గం మేం వదలం. అందువల్ల మీకు క్షేమం."

ఈలోగా మాదిగలు గుంపుగా వచ్చి గోడకవతల నిలబడి ఉన్నారు.

"నా కొడుకును చంపారు. నేను ఏడ్చాను. మర్చిపోయాను. రత్నాల్లాంటి మరి ముగ్గుర్ని హతమార్చారు. ఏడ్చి కన్నీళ్ళు తుడుచుకొన్నాం. మేం మిమ్మల్ని ఏమీ చేయం. మీరు మమ్మల్ని ఏమీ చేయవద్దు" అన్నాడు.

"చేస్తే" అని రెడ్డి రెట్టించాడు. "వెర్రి ఎవరు ఆపగలరు" అని నరసప్ప బదులు చెప్పాడు.

రెడ్డి, నాయుళ్ళిద్దరూ తమ ఆధిక్యాన్ని ఎవరో ప్రశ్నిస్తున్నట్లు భావించారు. తమ పెత్తనం పునాదులు కూలుతున్నట్లు సందేహించారు.

"ఏమీ లేని నువ్వు ఇంతగా మాట్లాడుతున్నావే" అన్నారిద్దరూ.

"ఏమీ లేదు కాబట్టే మాట్లాడుతున్నాను. నేను పోతే బోడిలింగం. పోయినా ఒకటే, ఉన్నా ఒకటే. నేనే పోగొట్టాలనుకొంటే - చాలామందివి చాలా పోతాయి కదా" అని ఇద్దర్నీ ప్రశ్నించాడు.

"యేం కుట్ర చేస్తా ఉండినారువై సెప్పు" అన్నారు.

"నేనేమి చెప్పగలను, లేనిదాన్ని, రానిదాన్ని, జరగనిదాన్ని ఊహించటం కష్టం"

"నిన్నిక్కడ నరికి పాతేస్తే నీకెవరు దిక్కు?" అని ఎవరో యువకుల గుంపులోంచి అంటే "దేవుడే!" అన్నాడు నరసప్ప.

చివరకు పెద్దలు తేల్చారు. "ఎవరి పూజ వాళ్ళది. ఎవరి ఊరేగింపు వాళ్ళది. ఎవరికి ఎవరూ అడ్డుపడకూడదు. గొడవలు సృష్టించకూడదు."

ఎవరి ఊరేగింపు ముందు పోవాలా అని పట్టింపు వచ్చింది. "మా ఊరేగింపే ముందుండాలని మీరు చెబితే ముందే ఉంటుంది. చివరకు ఉండాలని అంటే చివరికే ఉంటుంది."

చివరకే ఉండాలన్నారు.

సంతోషంగా చివరకే మా ఊరేగింపు పోతుంది. ముందు నిమజ్జనానికి పోయిన చివరి ఊరేగింపు సాయంకాలం ఆరు గంటలలోపు ముగిసిపోతే మేలు. మా ఊరేగింపు ఆరుగంటలకు ప్రారంభమవుతుంది.

సరేనంటే సరేననుకొన్నారు. కానీ ఇరు వర్గాలమధ్య ఊరేగింపు రాత్రిపూట ఏం అఘాయిత్యం జరుగుతుందోనని సందేహాలు బయలుదేరాయి.

"నమ్మకంతో బతకాల్ల. సందేహాలతో జీవించలేం? మీరు మా రైతులు. మేం మీ కూలీలు. మనం ఒకరికొకరం కావాల్ల. మనం ఒకర్ని ఒకరు కాపాడుకోవాల్ల. చంపుకోకూడదు."

నరసప్ప నమ్మబలికినా అటూ ఇటూ కూడా అనుమానాలున్నాయి.

నరసప్ప తెగేసి చెప్పటం, నాలుగు ఉపకులాల నేసేవాళ్ళకు, నాలుగు విభాగాలుగా ఉన్న గొల్లవాళ్ళకు, నాలుగు వేరు వేరు కులాలుగా ఉన్న బలిజవాళ్ళకు నచ్చింది. ఏమీ లేనివాడే అంతగా తెగబడి తన మర్యాద మానం మాట చెబితే మనకేం రోగం, మనం చెప్పలేకపోవటానికని వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకొంటుంటే ఆ కులాల పెద్దలు "ఏమీ లేనోనికి ఏం పోతది. ఏవయినా కూయొచ్చు. మనకీ వానికీ సాటా? పోటా?" అంటూ సర్దిచెబుతున్నారు. "ఎద్దులు కుమ్ముకుంటుంటే దూడలు సావ్వా?" అని బీదాబిక్కి చిన్నా చితకా వాళ్ళు కిక్కురుమనటం లేదు.

ప్రతివాళ్ళకు ప్రతివాడిని చూచి భయమే! ఎవరేం చేస్తారోనన్న సందేహమే! దేవుణ్ణి పగలకొడతారా? పందిరికి నిప్పు పెడతారా? ఏం చేస్తారు?

గణేశుల్ని పెట్టిన అయిదు గ్రూపుల వాళ్లు రాత్రీ పగలు నిద్రపోకుండా పందిళ్ళదగ్గర కాపలా ఉంటున్నారు. విగ్రహాలను కాపాడుకొంటున్నారు. దేవుళ్ళు మానవుల్ని రక్షిస్తారని విశ్వాసం. కానీ దేవుడి విగ్రహాలను మానవులు రక్షింపవలసి వచ్చింది.

హైవేలో దూసుకొచ్చే మోటార్ సైకిళ్ళ వాళ్ళు బాంబులేసి అంతే వేగంతో వెళ్ళిపోతారని చెవులు కొరుక్కోసాగారు జనం. ఎవరికీ శాంతి లేదు. ఎందుకొచ్చిన విగ్రహాలు, పూజలని పెద్దలు గొణుగుతున్నారు.

ఎప్పుడు ఏమయినా జరగవచ్చునని పెద్దలు ఇళ్ళు వదిలి బయటికి రావటం లేదు. పిల్లల్ని వీధుల్లోకి పోనివ్వటం లేదు. ఆపినా ఆగని యువకులు విగ్రహాల పందిళ్ళ దగ్గర గుమిగూడుతున్నారు.

తమ వినాయకుణ్ణి అందరూ దర్శిస్తున్నందుకు మాదిగలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. నరసప్ప మీసంలేని మూతి మీద దీపావళి పండగ జరుగుతుంటే స్వామికి వంగొంగి మొక్కుతున్నాడు.

మాదిగల వినాయకుడి విగ్రహం దగ్గరకు ఇంతకాలం ఇతరులు వచ్చేవాళ్ళుకారు. ఇప్పుడందరూ వస్తుంటే తమ ఇళ్ళకు, పెళ్ళి పేరంటాలకు ఊరంతా వచ్చి ఆశీర్వదిస్తున్నట్లు సంతోషిస్తున్నారు వాళ్ళు.

ఆ రోజు రాత్రి ఏ దేవుడూ నిద్రపోలేదు.

ఏభై ఏళ్ళ క్రితం దాకా ప్యాపిలిలో మాదిగలు ఎక్కడ ఉన్నారో ఎవరికీ పట్టేది కాదు. రాను రాను వాళ్ళమీద కోపం ద్వేషం పెరగసాగాయి.

నాగిరెడ్డి పుణ్యమా అని వాళ్ళు కూలి పెంచమని అడిగేవాళ్ళుగా, మాట్లాడేవాళ్ళుగా, తలెత్తుకొని నిలబడేవాళ్ళుగా మారిపోయారు. కమ్యూనిస్టులు చీలిపోబట్టి సరిపోయింది. కాని లేకపోతే ఊరు చీలిపోయేది. మాదిగలు మాట వినేవాళ్ళు కారు.

ప్రభుత్వం బంజర్లు పంచే పని మొదలుపెట్టే సరికి మాదిగలకు ఉత్సాహం వచ్చింది. పందేదో, పందందో అయిదెకరాల పొలం ప్రతి మాదిగ ఇంటికి పట్టా వచ్చింది. ఎన్నడూ తన దేశంలో, తన ఊరిలో, తన నేలలో తనకేమి లేనివాడయిన మాదిగ భూమి పుత్రుడు కావటమే కాదు, భూమి యజమాని కావటంతో గుండెల్లోకి గాలి ఎక్కువగా పీల్చసాగాడు.

నీకూ భూమి ఉంది. నాకూ ఉంది అన్నట్లుగా వీళ్ళు ప్రవర్తింపసాగారు. బావులు, మోటలు వచ్చి, అవి ఎండిపోగా బోర్లు కరెంటు ఇంజన్లు వచ్చి, తమ భూములు పంటలు తెస్తుంటే వాళ్ళ కళ్ళలో నీళ్ళింకిపోసాగాయి.

పనుల కాలంలో, పంటల కాలంలో వద్దన్నా వచ్చే మాదిగ కూలీలు, రమ్మన్నా వచ్చే పరిస్థితి తగ్గుతూ ఉండటంతో వ్యవహారం రైతులకు మింగుడుపడటం లేదు.

హరిజన కాలనీ కట్టించి, అందరికీ ఇళ్ళు ఇస్తే, మాదిగలు తమకు సొంత ఇళ్ళు, గట్టి ఇళ్ళు ఏర్పడటంతో ఎండకూ వానకూ దూరమయ్యారు. అట్లాగే ఊరికీ దూరమయ్యారు. చిన్నపనికి, పెద్దపనికి మాదిగలే అందుబాటులో ఉండక, అందక రైతులకు కష్టంగానే ఉంది.

ప్యాపిలిలో స్కూలు వచ్చింది. హరిజన బాలికల బాలుర వసతి గృహాలు వచ్చాయి. వాళ్ళు పిల్లల్ని హాస్టళ్ళలో చేర్చి స్కూల్‌లో చదివించసాగారు. ఆ ఊరి మాదిగ పిల్లలు చదివి ఉద్యోగాలలో కూడా చేరారు.

తమకు చిన్న జీతగాళ్ళు సేద్దెగాళ్ళు కొరత ఏర్పడి, చిన్నపనీ, పెద్దపనీ, తామే చేసుకోవలసి వచ్చి రైతులు బాధపడసాగారు. తరతరాలుగా తమకు, తమ ఇళ్ళకు పొలాలకు సేవ చేసినవాళ్ళు తమకు దూరం కావటం గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది.

రైతు పిల్లలు పెద్దగా చదువుకోవటం లేదు. చదువుకొన్నా పై చదువులకు పోవటం లేదు. పోయినా ఉద్యోగాలు రావటం లేదు. ప్యాపిలి నుంచి అనంతపురం పోయి యూనివర్శిటీలో చదివిన యువకులు ఉద్యోగాలు లేక, చదువువల్ల పొలం పనులు చేతకాక చేయలేక, ఎందుకూ పనికిరాని వాళ్ళయ్యారు.

మాదిగల పిల్లలు చదువు కోగానే ఉద్యోగాలలో చేరుతున్నారు. గ్రామ కార్యదర్శి, అటెండరు, క్లర్కు పోలీసు కానిస్టేబులు, యం.ఆర్.ఓ., కాంట్రాక్టు లెక్చరరు, లెక్చరరు, యస్.ఐ. ఉద్యోగాలు సంపాదించుకొన్నారు. ఒకడు కలెక్టరు కావాలని కూడా కొండకు వెంట్రుక కట్టే పరిస్థితి వచ్చి, చచ్చి శవమయ్యాడు.

నిన్నటిదాకా కూటికి లేనోళ్ళు, ఇవాళ మొనగాళ్ళయ్యారు. నిన్నటిదాకా జీతగాళ్ళు, సేద్దెగాళ్ళు ఇవాళ యజమానులయ్యారు. ప్రతి పైసాకు యాచించే, బదులడిగే, అప్పులు ఇమ్మనే వాళ్ళు ఇప్పుడు సంపాదించేవాళ్ళు అయ్యారు. కావాలంటే రైతుకు అప్పులు ఇవ్వగలిగేవాళ్ళుగా మారారు.

కడుపు భగ్గుమనదూ!

మాదిగలు ఉద్యోగం వచ్చి ఏ ఊర్లోనో బ్రతికితే ప్యాపిలి జనం చూచింది లేదు. కుమిలిందీ లేదు.

సోషల్ వెల్ఫేర్ వాళ్ళు మాదిగలకు చెప్పుల షాపులు మంజూరు చేశారు. స్వయం ఉపాధి పథకాలు అమలుచేశారు. కొందరు చెప్పుల షాపులు పెట్టుకొన్నారు. కొందరు చిల్లర అంగళ్ళు, కూల్‌డ్రింకులు, బీడి సిగరెట్లు అమ్మకాలు సాగిస్తున్నారు.

అదీ స్వగ్రామంలో. ఎవర్నీ స్థలమడగలేదు. రోడ్డు మీద షాపు. రూం అడగలేదు. చెక్క పలకలతో షాపు. చెప్పులమ్మినా, షోడాలమ్మినా కుర్చీ మీదే కూర్చోవటం. ఎవరు కొంటారు? ఎవరైనా కొంటారు. నేషనల్ హైవే! ఆటంకమే లేదు. వ్యాపారం బాగా జరుగుతూ వచ్చింది. గ్రామస్థులు కూడా వాళ్ళ దగ్గర కొనసాగారు. మాదిగలు అమ్మసాగారు.

ఎవరొచ్చినా లేవకుండా నీలిగి కుర్చీ మీద కూర్చుని అమ్మటం బాగాలేదని ఎవరో నరసప్పతో అనకపోలేదు.

రోజంతా నిలబడి అమ్ముకోలేదు కదా పాపంఅని సర్దుబాటుగా చెప్పాడు నరసప్ప.

నిన్నటిదాకా అన్నిటికి గ్రామస్థుల మీద ఆధారపడ్డ మాదిగలమీద ఇవాళ కొన్నింటికయినా గ్రామజనం ఆధారపడవలసి వచ్చింది. మాదిగల దగ్గరకు వెళ్ళి రావాలంటే అడిగి తెచ్చుకోవాలంటే నామోషిగా ఉండదా అంటే ఉంటుంది కాని, క్రమంగా అదే సర్దుకొంటుందని నరసప్ప ఓదార్పుగా చెప్పాడు.

రోడ్డు మీద షాపులు పెట్టుకొన్న మాదిగలు చెక్కల నుంచి సిమ్మెంటు ఇటుకలలోకి మారారు. రేడియో పెట్టారు. ట్రాన్సిస్టరు పెట్టారు. టీ.వి. పెట్టారు. ఆటలు, పాటలు, నవ్వులు, కేరింతలు. గ్రామం భరించలేకుండా ఉంది.

అరశతాబ్దంలో గ్రామం అంతగా మారిపోతుందని ఎవరూ ఊహించలేదు.

అన్నదమ్ములుగా ఉన్న జనం కులాలుగా, పార్టీలుగా, ఫ్యాక్షన్లుగా మారిపోయారు.

అందరూ అందరిమీద ఆధారపడుతున్నారు. అందరూ అందరికీ దూరంగా ఉంటున్నారు. ఎవరూ ఎవరినీ నమ్మటం లేదు. సమష్టి గ్రామం వ్యష్టిగా మారిపోయింది.

ఆ పరిస్థితుల్లో పోయినేడు గణేశ్ నిమజ్జనం రోజు నలుగురు అభివృద్ధిలోకి రావలసిన మాదిగ యువకులు అంతరించిపోయారు.

ఆ నేపథ్యం వల్ల ఈ ఏటి ఉత్సవం ఉత్సాహంగా లేదు. భయంగా ఉంది.

ఎవరు ఏం చేస్తారోనన్న భయంవల్ల, ఏ అలికిడి అయినా జాగ్రత్తపడటం కోసం, పందిళ్ళ దగ్గర మైకులు బంద్ చేశారు. నిశ్శబ్దం రాజ్యమేలుతూ ఉంది. ఎవరూ నిద్రపోవటం లేదు. శవజాగారం.

క్షణమొక యుగంలాగా గడిచిన రాత్రి ప్రశాంతంగా తెల్లవారింది.

నిమజ్జనం కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మణ వీధి విగ్రహ నిమజ్జనం ముందు. నేషనల్ హైవేలో కర్నూలు వైపుకు మిట్టదిగిపోతే చెరువు. నీరుంది. నిమజ్జనం చేయాలి.

'నిమజ్జనం జరుగుతుందా?'

'జరుగుతుంది'

'ఎందువల్ల?'

'భక్తివల్ల!'

'ప్రమాదం జరగదా?'

'జరగదు!'

'ఎందువల్ల?'

'భయం వల్ల!'

'ఇది మంచిదా?'

'ఇప్పటికి మంచిదే!'

'మునుముందు ఇలాగ్గే ఉంటుందా?'

'ఉండదు!'

'ఎలా ఉంటుంది?'

'ప్రేమగా, ధైర్యంగా, నిర్భయంగా!'

'ఆ రోజు వస్తుందా?'

'వస్తుంది! రావాలి! అందుకోసమే ఎదురుచూపులు!!! '

ఎవరో అడిగిన ప్రశ్నలకు నరసప్ప జవాబులు చెప్పాడు.

'ఎందుకు మనం విగ్రహం పెట్టటం?'

'భక్తి వల్ల!'

'ఏం సాధించినట్టు?'

'భక్తి!'

'ఇంకా?'

'భయాన్ని జయించటం'

'మాదిగలు భయాన్ని జయించినట్లేనా?'

'జయిస్తున్నారు!'

'భయానికి బలికారా?'

'కారు! నమ్మకమా?'

'నమ్మకమే!'

'ఎవరూ ఏమీ చేయరా?'

'చేయరు!'

'ఏమిటా ధైర్యం?'

'నా ఆత్మవిశ్వాసం!'

మాదిగలు అడుగుతుంటే నరసప్ప స్థిరంగా చెప్పాడు.

మాదిగలు భయపడుతూనే ఉన్నారు.

నాలుగో విగ్రహం నిమజ్జనం అయిపోయింది.

ఆరు గంటలకంటే ముందే మాదిగల గణేశ్ విగ్రహం ఊరేగింపు మొదలైంది. ఇంకా చీకటి పడలేదు. నేషనల్ హైవేకి రెండు వైపులా ఎక్కడో ప్రమాదం పొంచి ఉందని వాళ్ళు భయపడుతూ ఉన్నారు.

"ఈ ఊరేగింపు అవసరమా?" ఎవరో అడిగారు. నరసప్ప చాలా సేపు ఆలోచించాడు. "ఇప్పటికి అవసరమే. ఊరేగింపు అవసరం లేనిరోజు చేరుకోవటానికి ఈ ఊరేగింపు అవసరమే."

నరసప్ప నాలుగు పేకెట్ల సారా తాగాడు. గొంతులో పడ్డ ప్రతి చుక్క మనిషిని నిటారుగా నిలబెట్టింది. నీలిగి నిలబడ్డాడు. కడ్డీలాగా మారిపోయాడు. మంటపెట్టి దప్పు వేడి చేశాడు. అది కణకణలాడింది. ఖణేల్ మంది. కాళ్ళకు గజ్జెలు కట్టుకొన్నాడు. అడుగేశాడు. పది దప్పులు

అడుగులో అడుగు కలిపాయి. లైట్ల బండి ముందుంది. విగ్రహం ట్రాక్టరు వెనక ఉంది. ఊరేగింపు మొదలయింది.

ఊరంతా దూరం నుంచి ఊరేగింపు చూస్తూ ఉంది. నేషనల్ హైవే ట్రాఫిక్ ఆగిపోయింది. ఇటు ఊరికివతల, అటు చెరువుకు అవతల వాహనాలు ఆగిపోయాయి. మధ్యలో ఊరేగింపు మైళ్ళకొద్దీ వాహనాలు బారులు తీరాయి.

గొడ్డళ్ళు, వేటకొడవళ్ళు, బరిసెలు, బాకులు రోడ్డు మీదికి రాలేదు. బాంబులు పడలేదు. కనీసం రాళ్ళు వానగా కురవలేదు. దప్పుల చప్పుడు తప్ప, ఏ అలికిడి లేదు.

నరసప్ప అడుగులు – చిందు – చూడటం ఒక ఆనందం. గజ్జెల మోత – సంగీతం – వినటం, ఒక పండగ. దప్పుల చప్పుళ్ళు పెద్ద ఉత్సవం తిలకించటం ఉత్సాహం.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనమయింది.

'నీకానందంగా ఉందా?'

'లేదు! ఎందువల్ల?'

'నేను చావనందువల్ల!'

'ఎందుకు చావలేదు?'

'భయంవల్ల!'

'ఎవరి భయం?'

'జనాల భయం!'

'ఏ జనాలు?'

'ఊరి జనాలు!'

'ఇది జయమా?'

'పరాజయం!'

'మరి ఇదేమిటి?'

రానున్న విజయాలకీ పరాజయం

'సంకేతం!'

జయ వెంట ఉన్నవాళ్ళ సందేహాలకు ఇవి నరసప్ప సమాధానాలు. ఇవి అలిసిపోయిన మత్తు దిగుతున్న నరసప్ప సమాధానాలు. ట్రాఫిక్ మొదలయింది.

రిపబ్లిక్ డే నాడు వాహనాల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతిలాగా నరసప్ప వచ్చే పోయే వాహనాలకు దండం పెడుతున్నాడు.